క్లుప్తంగా...

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఓటుపై అవగాహన



మేడ్చల్: యువత ఓటును అమ్ముకోవద్దని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ టీఎస్‌వీఎస్ త్రిల్లేశ్వర్ అన్నారు. గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, స్ఫూర్తి జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు, ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజమైన ప్రజాసేవ చేసే నాయకులను ఎన్నుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో మెప్మా కో ఆర్డినేటర్ నరేష్, మెప్మా ఆర్పీలు, బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



మేడ్చల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద రాయిలాపూర్ గ్రామానికి చెందిన పలువురు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మేడ్చల్:మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో మున్సిపాలిటీలోని 23 వార్డుల్లో చేయాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం 31 ఎజెండాలకు సంబంధించి చేపట్టబోయే అభివృద్ధి పనులపై కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ చీర్ల రమేష్, కమిషనర్ టీఎస్‌వీఎస్ త్రిల్లేశ్వరరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజించాలి



మట్టి వినాయకులను తయారు చేసిన విద్యార్థులు

మేడ్చల్: మట్టి వినాయకుడిని పూజించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అత్వెల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు సూచించారు. పర్యావరణాన్ని రక్షించాలనే నినాదంతో పాఠశాల విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేసే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, పద్మలత, వసీం, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



అవుషాపూర్‌లో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకంలో 18 కులాలకు చేయూత కల్పించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ అవుషాపూర్‌లో ఓబీసీ మోర్చా గ్రామశాఖ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై పాలాభిషేకం చేశారు. శ్రీను, సందీప్, వెంకటరెడ్డి, భానుయాదవ్, మశ్చేందర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బస్వరాజ్, ప్రవీణ్, కృష్ణయాదవ్, సాయికిరణ్ పాల్గొన్నారు.







పచ్చదనంపై దండయాత్ర

శామీర్‌పేట్: విద్యుత్ మరమ్మతుల పేరుతో విద్యుత్ అధికారులు చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తూ ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్నారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధి, దేవరయాంజాల్ – కొంపల్లి రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ తీగల మరమ్మతులను శనివారం చేపట్టారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయనే సాకుతో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. ఈ విషయమై శామీర్‌పేట విద్యుత్ ఏఈ సురేందర్‌ను వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు. చెట్ల నరికివేతపై తూంకుంట మున్సిపాలిటీ ఎన్విరాన్‌మెంట్ అధికారిని వివరణ కోరగా చెట్ల నరికివేతకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు, అయినా విద్యుత్ ఏఈ, సిబ్బంది ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తున్నారని వివరణ ఇచ్చారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం పోచారం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధిని అర్హులు వినియోగించుకోవాలని కోరారు. చింతల అభినవ్‌కు రూ.37వేలు డి.మల్లేష్‌కు రూ.22 వేలు, యూ.వరలక్ష్మి రూ.40 వేల చెక్కులను అందుకున్నారు. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెండ్ గొంగళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, నాయకులు వెంకటేశ్, రాజు, అశోక్, శివారెడ్డి, నర్సింగ్, వినోద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తాం

సాక్షి, మేడ్చల్ జిల్లా: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా నాయకులు నరసింహ, చంద్రశేఖర్, అశోక్ విమర్శించారు. ఆరో రోజు సమ్మెలో భాగంగా శనివారం మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా, మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీ జాయింట్ యాక్షన్ కమిటీ (సీఐటీయూ, ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె నిర్వహిస్తుంటే ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కార్యక్రమంలో వామపక్ష ట్రేడ్ యూనియన్ల జిల్లా నాయకులు శివరాణి, అంజమ్మ, సువర్ణ, బాలమణి, శుక్ల, నాగమణి, అరుణ, రేణుక, మీనాక్షి, కిషోర్, జాన్, శ్రీనివాస్, హరినాథ్‌రావు, శోభారాణి, సునీత, పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాంచందర్‌రావు తదితరులు

కీసర: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. శనివారం దమ్మాయిగూడలో నిర్వహించిన సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంపుదలతో పాటు అపరిమిత ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పక్షాలకు తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయాలని కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ట్రస్టీ సభ్యులుగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రతినిధిగా కొత్తకాపు లక్ష్మారెడ్డిని నియమించడంపై సభ్యులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భూపెల్లి బానయ్య, కోశాధికారి ఎం.విజయబాబు, ఉపాధ్యక్షుడు ఆళవందార్ వేణుమాధవ్, విజయ్‌బాబు, ఉమాకర్, బీరయ్య, రఫిక్, సాంబశివ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆసియా–పసిఫిక్ కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులతో సీఈఓ నీలిమా, వైస్ చాన్స్‌లర్ రాంచంద్రం

ఘట్‌కేసర్: దేశంలో మొదటిసారి నిర్వహించనున్న ఆసియా–పసిఫిక్ కాన్ఫరెన్స్ రిజిస్ట్రేషన్(ఏపీసీసీఎస్ 2023) పోస్టర్‌ను వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం ఆవిష్కరించారు. ఈ సదస్సు నవంబర్ 19–22 వరకు టీ హబ్ హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సందర్భంగా డాక్టర్ గోవిందాచార్యులు, ప్రీత్ యాదవ్, డాక్టర్ కృష్ణకాంత్ మాట్లాడుతూ దేశంలోని సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ గురించి, అన్ని ప్రముఖ పరిశోధకులు, పరిశ్రమల నెట్‌వర్క్ తెలుసుకోవడానికి విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. సదస్సుతో విద్యార్థులు, యువ అధ్యాపకులు దేశవ్యాప్తంగా ఉన్న తోటి పరిశోధకుల నుంచి నేర్చుకోవచ్చని, ఇందులో అనేక పరిశోధన పత్ర ప్రదర్శనలు, డిజైన్ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సీఈఓ నీలిమా, వైస్ చాన్స్‌లర్ రాంచంద్రం, ప్రొఫెసర్లు అతుల్ నేగి, జబ్బార్, జయప్రకాశ్, రవీంద్ర, మంగళగౌరీ, నీరజ్ జైన్, సంజీవ్ బన్సాల్, సంతోష్, చక్రధర్ పాల్గొన్నారు.

పాడుబడ్డ సంపులో ఎముకలు, పుర్రె

శామీర్‌పేట్: ఓ పాడుబడ్డ సంపులో ఎముకలు, పుర్రె లభ్యమైన ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన శామీర్‌పేటలోని గ్రోమోర్ వెనుక గల పాడుబడ్డ సంపులో ఎముకలు, పుర్రె ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంచనామ నిర్వహించారు. ఎముకల పరీక్షల నిమిత్తం వైద్యులకు సమాచారం అందించామని, పరీక్షల అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని శామీర్‌పేట సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

మున్సిపాలిటీలో పర్యటించిన కమిషనర్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని రెండో వార్డులో కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ రమాదేవితో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సీ–2 పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానికులు వాకింగ్, వ్యాయామం చేసుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు యాదగిరిరావు, విమల, శశికళ, ఆంజనేయులు, శివ, యదయ్య, రాజు, హనుమంతరావు, సత్యంరావు, సంజీవముదిరాజ్ పాల్గొన్నారు.



రెండో వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సాబేర్ అలీ

తినుబండారాలపై అధికారుల పర్యవేక్షణ కరువు

మేడ్చల్‌రూరల్: హోటళ్లు, తినుబండారాలపై అధికారుల పర్యవేక్షణ కరువైందని సీపీఎం మండల కార్యదర్శి నరేశ్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్‌ఆర్ వెంచర్‌లో ఉన్న అమ్మచేతి వంట– తెలంగాణ రుచులు హోటల్‌లో రెండు రోజుల క్రితం బిర్యానీలో బొద్దింక రావడం దారుణమన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సదరు హోటల్‌ను వెంటనే మూసివేయాలని శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తినుబండారాల దుకాణాలపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. నాయకులు కొమురయ్య, రమేశ్, ప్రశాంత్, నర్సింగ్‌రావు, నర్సింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించి శిబిరంలో గ్రామస్తులు పాల్గొనగా వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు మోహన్‌బాబు, రవినాయక్, మహేశ్, వెంకట్, భిక్షపతి, లక్ష్మినారాయణ, నర్సింహ గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



మేడ్చల్‌రూరల్: వేతనాలు పెంచి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్మికుల నిరసన కార్యక్రమం చేపట్టారు. బిల్‌కలెక్టర్లు, మెప్మా, కంప్యూటర్ ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, సంతోష్, కిరణ్, సుజాత, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

మేడ్చల్‌రూరల్: మండలంలోని గౌడవెల్లి గ్రామ పరిధిలోని యశోద నర్సింగ్ కళాశాలలో శనివారం పంచాయతీ అధికారులు, పాలకవర్గం ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శాంతి, ఉపసర్పంచ్ పెంటమ్మ, బీఎల్‌ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులు



అహ్మద్‌గూడలో గ్రౌండ్‌ను పరిశీలిస్తూ..

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌ను శనివారం కీసర మండల క్రిస్టియన్ సెమటరీ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పరిశీలించి అభివృద్ధి పనులు చేపట్టారు. బరియల్ గ్రౌండ్‌లో ముళ్లపొదలు, చెట్టకొమ్మలను మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ సహకారంతో అందజేసిన ట్రాక్టర్‌తో చదునుచేయించారు. కె.యం.సి.సి అసోషియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్, వైస్‌ప్రెసిడెంట్ బిషప్ ఫిలిప్ మాదాసు, సెక్రటరీ, ఎం.సాల్మాన్, జాయింట్ సెక్రటరీ పాస్టర్ ఎం.పాల్ డేవిడ్, ట్రెజరర్ గాబ్రియెల్, సభ్యులు, పాస్టర్ జయరాజ్, రాజేష్, డేవిడ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలు ప్రారంభం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కీసర సీఐ వెంకటయ్య తదితరులు

కీసర: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. శనివారం కీసరలోని సెరినిటీ స్కూల్ ఆవరణలో 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడ్చల్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకుంటూ విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. క్రీడాపోటీల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాపోటీల్లో జిల్లా పరిధిలోని 8 జోన్లకు సంబంధించిన 400 మంది బాలబాలికలు పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు కీసర మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా, ఎంపీటీసీ సభ్యులు బెలిదే రమేష్‌గుప్తా, మచ్చాని జంగయ్యయాదవ్, క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. బీఆర్‌ఎస్ నేత తటాకం భానుచందర్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, జోనల్ ఇన్‌చార్జి బి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సొమ్ముతో చేసిన అభివృద్ధిని ప్రజలు నమ్మరు

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎన్నికలకు ముందు అవనీతి సొమ్ముతో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ట్యాక్స్ గోల్‌మాల్‌పై కమిషనర్ స్పందన అభినందనీయమని, అవినీతికి పాల్పడిన కమిషనర్లను వదిలిపెట్టి మేనేజర్లను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోందని, చెరువులు, పార్కులు, రోడ్డు కబ్జాలు ఓ ప్రముఖ నాయకుడి కనుసన్నల్లో జరుగుతుందన్నారు. జోడిమెట్ల సమీపంలో ఆయన భూమి ఆక్రమించి షెడ్డు నిర్మించారని ఆరోపించారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న బీజేపీతోనే మెరుగైన పాలన లభిస్తుందని, మున్సిపల్ ట్యాక్స్ గోల్‌మాల్‌పై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రవీందర్‌రెడ్డి, నరేశ్, విక్రాంత్‌రెడ్డి, వీరేశం, మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందజేస్తోందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న మిల్లెట్స్(పోషణ ఆహారం)పై అవగాహన కల్పించారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, హెల్త్ డాక్టర్ ఏఎన్ఎం అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, రమాదేవి, సునీత, రజిని, అనురాధ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత మురుగు కాల్వ పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో గ్రామ పంచాయతీ నిధులు రూ.6 లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ పనులను సర్పంచ్ గోపాల్‌రెడ్డి శనివారం గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, వార్డు సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనుల ప్రాధాన్యత క్రమంలో చేపడతామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్, పవన్‌నాయక్, పద్మ, శోభ, శ్వేత, కో ఆప్షన్ సభ్యుడు సురేశ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్, మాజీ వార్డు సభ్యుడు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



ఘనాపూర్‌లో అంతర్గత మురుగు కాల్వ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

టెక్నికల్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



టెక్నికల్ సింపోజియం అశ్వతి వేణుగోపాల్, జితేంద్ర సింగ్

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు, యువత టెక్నికల్ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీనియర్ డైరెక్టర్ అశ్వతి వేణుగోపాల్, సీటీఎస్ హైదరాబాద్ హెచ్‌ఆర్ జితేంద్ర సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మేధ 23 23 పేరిట రాష్ట్రస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నికల్ సింపోజియంలు ఇండస్ట్రీకి వారధిలా ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఇన్నోవేటివ్, క్రియేటివిటిని రూపొందించడంలో యువతకు ఎంతో తోడ్పడుతుందని వివరించారు. కళాశాలలో ప్రతీయేటా నిర్వహించే టెక్నికల్ సింపోజియంకు విద్యార్థినులు ఆసక్తి కనబరుస్తున్నారని, టెక్నికల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అభినందించారు. టీపీఓ, డీన్స్, హెచ్‌ఓడీలు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

19వ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మేక లలితాయాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 19వ డివిజన్ గిరిప్రసాద్‌నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కార్పొరేటర్ మేక లలితాయాదవ్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, మంత్రి మల్లారెడ్డి సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. డివిజన్ అధ్యక్షులు వినోద్, ప్రధాన కార్యదర్శి లింజోజి, నాయకులు రాజు, పరమేష్, బంగారాజు, సుజాత పాల్గొన్నారు.